
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 20 ఏప్రిల్ 2025 | 5



అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 (శనివారం)
కనిష్ఠం : 29.0

డీఎస్సీ షెడ్యూల్ విడుదల

- ఉమ్మడి జిల్లాలో 1,241 పోస్టులు
- నోటిఫికేషన్‌కు అనుమతి జారీ


కాకినాడ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ నోటిఫికేషన్‌కు ఎదురు చూస్తున్న కొన్ని లక్షల మంది అభ్యర్థుల కల నెరవేరింది. డీఎస్సీ నోటిఫికేషన్‌కు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదివారం ఉదయం నోటిఫికేషన్ విడుదలవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 16,347 వరకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేయనున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 45 రోజుల తరువాత పరీక్షలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలివే....

మొత్తం 1,241 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీచేయనున్నారు.స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తెలుగు 65, హిందీ 78, ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయాలాజికల్ సైన్స్ 103,సోషల్ స్టడీస్ 132, వ్యాయామ విద్య 210, ఎస్జీటీలు 423 డీఎస్సీ ద్వారా భర్తీకానున్నాయి.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ సంబంధించి ఫిజికల్ సైన్స్ 3,బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామవిద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీచేయనున్నారు.ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి మొత్తం 31 పోస్టులు భర్తీకానున్నాయి.జోన్ 2(ఉమ్మడి ఈస్ట్, వెస్ట్, కృష్ణా)కి సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్ డబ్ల్యు, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24లతో కలిసి 348 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తారు.

హ్యాపీ బర్త్‌డే చంద్రబాబు

చంద్రబాబు.. ఉభయ తెలుగు రాష్ట్రాలో ఈ పేరు తెలియనివారుండరు.. ఎందుకంటే రాజకీయాల్లో మాస్టారు.. అపరచాణక్యుడిగా పేరు.. ఏపీ అభివృద్ధికి కంకణం కట్టుకున్న మెగాస్టారు.. రాజధాని అమరావతికి ఆద్యుడు.. ప్రజల మనసెరిగిన మహా నాయకుడు.. ఆయనే సీఎం చంద్రబాబునాయుడు. ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో ఆయనకంటే సీనియర్ ఎవరూ లేరు.. ప్రజలకు ఏదో చేయాలనే తపన.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పం.. ప్రజలకు అండగా నిలబడే తత్వం.. అదే గత సార్వత్రిక ఎన్నికల్లో విజయం వైపు దూసుకెళ్లేలా చేసింది.. బాబు వస్తే.. అభివృద్ధి చేస్తారు.. పేదలకు అండగా నిలబడతారని ప్రజలు నమ్మారు.. ఓటేశారు.. ఏకంగా 164 స్థానాలు ఇచ్చారు.. నేడు 75వ పుట్టినరోజు.. హ్యాపీ బర్త్‌డే బాబు అంటూ టీడీపీ కేడర్ జిల్లాలో సంబరాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆదివారం ప్రత్యేకం

సి..నిమా హిట్టే!



హీరో బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమా చూశారా.. అందులో విలన్ కొడుకు షిప్‌లో కస్టమ్స్‌కు దొరికిపోతాడు. అప్పుడు విలన్ ఆ షిప్‌ను సముద్రంలోనే పేల్చేస్తాడు.. ఆ సీన్లలో కొన్ని కాకినాడ సీపోర్టులోనే తీశారు.

పుష్ప-2 సినిమాలో ఎర్రచందనం దుంగలను విదేశాలకు షిప్‌లో తరలించే సీన్ చూశారా.. అందులో హీరో అల్లు అర్జున్ పోర్టులో నిలబడి సవాల్ చేస్తాడు.. ఆ తర్వాత ఎర్రచందనం పట్టుకోవడానికి విలన్ ఫాజిల్ సైతం పోర్టులో అడుగుపెడతాడు.. ఆ కీలక సన్నివేశాలు ఎక్కడో తెలుసా.. ఇదిగో మన కాకినాడ సీపోర్టులోనే..

కాకినాడ పోర్టులో పుష్ప-2 సినిమాలో అల్లు అర్జున్‌పై తీసిన సీన్

దుల్కర్‌సల్మాన్ హీరోగా నటించిన లక్కీ భాస్కర్ సినిమాలో హీరో తీవ్ర ఆర్థిక సమస్యల్లో ఉంటాడు. ఈ సమయంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ రాంకీ హీరో వద్దకు వెళ్లి రూ.2 లక్షలు ఇస్తే పోర్టులో దిగుమతై ఉండిపోయిన టీవీల స్టాకును రప్పిస్తానని చెబుతాడు. అప్పుడు రాంకీ హీరో వద్ద డబ్బులు తీసుకుని పోర్టులో కస్టమ్స్‌కు డబ్బులు ఇచ్చి టీవీల స్టాకును విడిపిస్తాడు. దాంతో హీరోకు భారీగా లాభం వస్తుంది. ఈ ముఖ్యమైన సీన్లన్నీ ఎక్కడో కాదు.. కాకినాడ సీపోర్టులోనే షూటింగ్ చేశారు.

బ్లాక్‌బస్టర్ మూవీ అలవైకుంఠపురంలో హీరో అల్లు అర్జున్ విలన్ సముద్రఖనితో గొడవ పడే సీన్లు చూశారా.. అక్కడ విలన్ కొడుకుతో సాగించే ఆసక్తికరమైన స్టైలిష్ ఫైట్లు అందరినీ అలరిస్తాయి. ఇది కాకినాడ సీపోర్టులోనే షూటింగ్ చేశారు..





సినిమాల విజయతీరం కాకినాడ!

22 సినిమాల షూటింగ్

అనేక బ్లాక్‌బస్టర్ తెలుగు సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాకినాడ సీపోర్టు మారింది.. చాలా సినిమాల్లో అత్యంత కీలక సన్నివేశాలు, క్లైమాక్స్ ఫైట్లు, షిప్‌ల్లో కార్గో ఎగుమతికి సంబంధించిన సీన్లు సీపోర్టులోనే చేస్తున్నారు. పోర్టులో షూటింగ్ చేయడానికి హీరోలు, డైరెక్టర్లు, నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సినిమాలో ఏదొక చిన్న పార్ట్ అయినా పోర్ట్‌లో షూట్ చేస్తే బొమ్మ హిట్ అనే సెంటిమెంట్ బలపడిపోయింది. అందుకే అనేక సినిమాలు పోర్టులో షూటింగ్ చేసుకుని హిట్ కొడుతున్నాయి. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)



తెలుగు సినిమా మారింది.. బడ్జెట్ పెరిగింది.. చిత్రీకరణలోనూ తేడా వచ్చింది.. ఎక్కడో విదేశాలకు కాకుండా లోకల్ స్పాట్లకు డిమాండ్ పెరిగింది. గతంలో సినిమా తీశారంటే విదేశాలకు వెళ్లాల్సిందే. ప్రస్తుతం గోదావరి జిల్లాల వెంట పరుగెడుతున్నారు. సముద్రం.. పోర్టు.. కావాలంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ పోర్టులో సినిమా హీరోలు.. డైరెక్టర్లు వాలిపోతున్నారు. వంద కోట్ల బడ్జెట్ నుంచి రూ.10 కోట్ల బడ్జెట్ సినిమాల వరకు కాకినాడ సీపోర్టులో షూటింగ్ చేసుకోవడానికి పోటీపడుతుంటారు. తరచూ సినిమా షూటింగ్ లతో సందడి మారి సినిమా పోర్టుగా పేరు తెచ్చుకుంది. పోర్టులో అనేక ప్రాంతాలు కీలక సన్నివేశాల చిత్రీకరణకు అనువుగా ఉండడంతో చాలామంది డైరెక్టర్లు సినిమా షూటింగ్‌లకు ఎంచుకుంటున్నారు. సీపోర్టుకు తరచూ వివిధ దేశాల నుంచి భారీ నౌకలు ఏకంగా బెర్త్ వద్దకే వస్తాయి. కార్గో లోడింగ్‌కు వారం నుంచి పది రోజుల వరకు ఇక్కడే ఉంటాయి. కస్టమ్స్ అధికారులు, భారీ క్రేన్లు, టిప్పర్లు, విశాలమైన బెర్త్‌లు, వెనుక సముద్రం.. ఇవన్నీ సినిమా షూటింగ్‌కు అనువుగా, అందంగా ఉంటున్నాయి. దీంతో అనేక చిత్రాలు ఇక్కడకు క్యూ కడుతున్నాయి.

షూటింగ్‌కు రోజుకు రూ.లక్ష

పోర్టు..షిప్‌లు.. సముద్రం బ్యాక్‌డ్రాప్‌లో సినిమా షూటింగ్ చేయాలంటే చాలా కష్టం. పోర్టుల్లో అనుమతులివ్వరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పోర్టులో షూటింగ్ చేయాలంటే వైజాగ్ పోర్టు కేంద్రం ఆధీనంలో ఉంటుంది. అనుమతులు కష్టం. పక్కనే గంగవరం పోర్టు ఉన్నా నేవీ స్థావరాల నేపథ్యంలో అనుమతులు రావు. ఆ తర్వాత కాకినాడ పోర్టు ఉంది. అయితే ఇక్కడ అనుమతులను పోర్టు యాజమాన్యం సులువుగా ఇస్తోంది.సినిమా షూటింగ్‌లకు విశాలంగా ఉండడంతో ఎక్కువ మంది డైరెక్టర్లు ఇటే మొగ్గు చూపుతున్నారు. వాస్తవానికి ఎయిర్‌పోర్టు లేదా మెట్రో స్టేషన్లు, రైళ్లలో షూటింగ్ చేయా లంటే రోజుకు రూ.16 లక్షల వరకు ఛార్జ్ చేస్తారు. కాకినాడ సీపోర్టులో రోజుకు షూటింగ్‌కు రూ.లక్ష వసూలు చేస్తారు. తక్కువ ఛార్జీలు ఉండడం కూడా పోర్టులో సినిమా షూటింగ్‌లకు కలిసివస్తోంది. వాస్తవానికి పోర్టు కట్టిన స మయంలో సినిమా షూటింగ్‌లకు ఛార్జి రోజు కు రూ.10 వేలు.అప్పుడే ఆర్.నారాయణ మూర్తి హీరోగా ఎర్రసముద్రం సినిమా షూటింగ్ చేశారు. సినిమా షూటింగ్‌లకు సరిపడా వాతావరణం పోర్టులో ఉండడంతో ఇక్కడకు క్యూ కడుతున్నారు. ఇక్కడ చిత్రీకరణ చేసుకున్న సినిమాల్లో 80 శాతం వరకు హిట్ అవుతున్నాయి. సినిమాకు సంబంధించి హీరో పోర్టులో షూటింగ్‌లో పాల్గొనే సన్నివేశాలుంటే ఆ సినిమా హిట్ పక్కా అని పోర్టు అధికారులు చెబుతుండడం విశేషం.

అల్లు అర్జున్‌కు ఎంత సెంటిమెంటో..

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్‌కు కాకినాడ సీపోర్టు సెంటిమెంట్‌గా మారింది. ఆయన సినిమా ఏదైనా సీపోర్టులో షూటింగ్ జరగాల్సిందే. తొలుత అలవైకుంఠపురం సినిమాలో కీలక ఘట్టాలన్నీ ఇక్కడే చిత్రీకరించారు. ఆ తర్వాత 'పుష్ప' సినిమా షూట్ చేశారు. ఈ సినిమా సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. పుష్ప-2 కూడా ఇక్కడే వారాల తరబడి షూటింగ్ చేశారు.

కాకినాడ సీపోర్టులో ఇప్పటివరకు 22 సినిమాల షూటింగ్‌లు జరిగాయి. 2000లో విజయకాంత్ హీరోగా మాస్, 2008లో ఆర్.నారాయణమూర్తి హీరోగా ఎర్రసముద్రం, 2018లో హీరో రామ్ నటించిన హలోగురు ప్రేమ కోసమే.. విజయ దేవరకొండ హీరోగా గీత గోవిందం.. అడవి శేష హీరోగా గూఢచారి, 2019లో శర్వానంద్ హీరోగా రణరంగం, 2019లో విజయ్ దేవరకొండ నటించిన డియర్ కామ్రేడ్, అల్లు అర్జున్ హీరోగా అల వైకుంఠపురం, 2021లో అల్లు అర్జున్ హీరోగా పుష్ప 2, హీరో శ్రీరాం నటించిన దాడి, చిరంజీవి, రాంచరణ్ నటించిన ఆచార్య, రవితేజ హీరోగా ఖిలాడీ, 2022లో నవీన్‌చంద్ర నటించిన రుద్ర, 2023లో బాలకృష్ణ భగవంత్ కేసరి, వెంకటేష్ నటించిన సైంధవ్, హీరో గోపిచంద్ నటించిన భీమ, రవితేజ హీరోగా టైగర్ నాగేశ్వరరావు, పవన్ కల్యాణ్ హీరోగా ఓజీ, 2024లో దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్, అల్లు అర్జున్ పుష్ప-2, హీరో సిద్దు డీజే టిల్లు స్క్వేర్, ఉపేంద్ర హీరోగా రేసీ-45 తదితర చిత్రాలు ఇక్కడే షూటింగ్‌లు చేసుకున్నాయి. పోర్టులో షూటింగ్ చేస్తే ఆ సినిమా హిట్ అనే ప్రచారం బలంగా ఉంది.





గోదావరి భవన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

డ్రోన్ టెక్నాలజీ రైతులకు లాభదాయకం : కలెక్టర్

అమలాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీని వినియోగించడం వల్ల శ్రమ ఖర్చును 70 శాతం వరకు తగ్గించుకోవచ్చని, రైతులకు ఇది ఎంతో లాభదాయకమని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. జిల్లాలోని వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో డ్రోన్ టెక్నాలజీని వినియోగించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో శనివారం డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై రైతుగ్రూపు కన్వీనర్లకు, బ్యాంకర్లకు, వ్యవసాయాధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రోన్ సాంకేతికత కంపెనీ డ్రాగో సీఈవోలు రవికుమార్, సుధీర్‌కుమార్‌లు పాల్గొని డ్రోన్ వినియోగం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఎకరాకు పంట పొలంలో మందును పిచికారీ చేసేందుకు మనుషులకు రూ.1500 ఖర్చు అయితే, డ్రోన్ టెక్నాలజీకి రూ.400 ఖర్చు అవుతుందన్నారు. ఈ విధానం అత్యంత సులభకరమని, తక్కువ సమయంలో పని పూర్తి చేసుకోవచ్చనన్నారు. రైతుకు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం, ప్రయోజనం చేకూరతాయన్నారు. జిల్లాలోని 35 రైతు గ్రూపులు డ్రోన్ టెక్నాలజీ వినియోగంపై మక్కువ చూపుతున్నారని వివరించారు. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.9.80 లక్షలు కాగా రైతుకు 80 శాతం రాయితీపై డ్రోన్ వస్తుందని, అయితే రైతు గ్రూపులు ముందుగా 50 శాతంగా రూ.4.90 లక్షలు బ్యాంకులో గ్రూపు పేరిట డిపాజిట్ చేయాలన్నారు. బ్యాంకు రుణం, సబ్సిడీ మంజూరైన తరువాత గ్రూపునకు డిపాజిట్ సొమ్ము తిరిగి వస్తుందన్నారు. మే నెలాఖరు నాటికి గ్రూపులకు డ్రోన్లు అందిస్తామన్నారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ మాట్లాడుతూ రైతు గ్రూపులకు రుణాల మంజూరు విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా మేనేజర్ వైఎస్ స్వామినాయుడు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పాల్గొన్నారు.

రూ.13,508 కోట్లతో నాబార్డు రుణ ప్రణాళిక విడుదల

అమలాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు సంబంధించి నాబార్డు రుణ ప్రణాళికను కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విడుదల చేశారు. జాతీయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రుణ ప్రణాళికను విడుదల చేసి సంబంధిత వివరాలను వెల్లడించారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో బ్యాంకుల ద్వారా రూ.13,508 కోట్లు రుణ సదుపాయాల అవకాశాలతో కూడిన ప్రణాళికలను రూపొందించినట్టు చెప్పారు. వ్యవసాయ, పంట రుణాలకు రూ. 5748.52 కోట్లు సూక్ష్మ, చిన్నా, మధ్యతరహా పరిశ్రమల కోసం రూ.5091.28 కోట్లతో రుణ ప్రణాళిక విడుదల చేశామన్నారు. మిగిలిన నిధులను విద్య, గృహ, సాంప్రదాయ శక్తి వనరులు, ఇతర రంగాలకు కేటాయించనున్నట్టు నాబార్డు డీడీఎం డాక్టర్ వైఎస్ నాయుడు తెలిపారు.

క్రీడాకారులు పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకునే అవకాశం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): 2026 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే పద్మ అవార్డులకు అంతర్జాతీయ క్రీడల్లో అత్యున్నత ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు విజయవాడ శాప్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ క్రీడాకారులు సంబంధిత వైబ్‌సైట్‌లో వ్యక్తిగతంగా పద్మ అవార్డులకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.



అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో స్వచ్ఛాంధ్ర సంకల్పంపై ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం!

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్‌చేసి పర్యావరణాన్ని కాపాడుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి సురక్షితమైన రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ (ఆర్ఆర్ఆర్) పద్ధతులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. మూడో శనివారం ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ విధానాలపై అవగాహన పెంపొందిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. గడియార స్తంభం సెంటర్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ఇతివృత్తంతో చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వర్ణాంధ్ర 2047 సంకల్పంలో భాగంగా ఈఏడాది ప్రథమార్థం నుంచి ప్రభుత్వం ప్రతీ నెల స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. పాడైపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను ఇంట్లో నిరుపయోగంగా ఉంచుకోవడం వల్ల వాటి నుంచి హానికర వాయువులు వెలువడి ప్రజారోగ్యానికి, పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు నిర్దేశిత రోజుల్లో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రజల నుంచి సేకరించి రీసైక్లింగ్ చేసేందుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టాలని సూచించారు. దుకాణాల్లో పాడైపోయిన మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఎప్పటికప్పుడు సేకరించి రీసైక్లింగ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల డిస్పోజల్‌పై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందన్నారు. ప్రజలు ఎలక్ట్రానిక్ పరికరాల వాడకాన్ని విపరీతంగా పెంచడం వల్ల పర్యావరణానికి చేటు తెచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు కంపోస్టు ఎరువులను పంపిణీ చేశారు. అలాగే పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆర్డీవో మాధవి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, నల్లా స్వామి, అధికారి జయ వెంకటలక్ష్మి, బోనం సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.



ఆలమూరులో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్, జిల్లా ప్రత్యేకాధికారి రవిసుభాష్



ముమ్మిడివరంలో స్వచ్ఛభారత్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల రామరాజు - 8లో

కేశవరంలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతుల ధర్నా

లక్ష్యం పూర్తయిందన్న ఆర్ఎస్‌కే సిబ్బంది.. తహశీల్దార్ హామీతో శాంతించిన రైతులు





కేశవరం కెనాల్ రోడ్డులో ధర్నా చేస్తున్న రైతులు.. చర్చలు జరుపుతున్న తహశీల్దార్ తేజేశ్వరరావు

మండపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం కేశవరంలో రైతుసేవా కేంద్రం ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రైతులు శనివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మూడు గంటలపాటు ధర్నా చేశారు. రైల్వేగేటు సమీపంలో ఉన్న కెనాల్‌రోడ్డులో కాటన్ విగ్రహం వద్ద రైతులు ఆందోళన చేయడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కడియం, జెడ్.మేడపాడు మధ్య వాహనాలు నిలిచిపోయాయి. కేశవరంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్చి 4న జేసీ నిశాంతి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, సివిల్ సప్లయిస్ రాష్ట్ర ఛైర్మన్ తోట సుధీర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఇక్కడ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. ఇటీవల రైతులు తీసుకువచ్చిన ధాన్యం లోడులను దింపుకోకపోవడంతో వాహనాలు బయట ఉండిపోయాయి. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. దాంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతుసేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ఎందుకు చేయడంలేదని సిబ్బందిని ప్రశ్నించగా, తమ టార్గెట్ మేరకు లాగిన్‌లో పూర్తయిందని సమాధానం చెప్పారు. దాంతో రైతులు ఆగ్రహించి ధాన్యం కొనుగోలు చేయాలంటూ శనివారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మండపేట తహశీల్దార్ టీ.తేజేశ్వరరావు కేశవరంలో ఆందోళన చేస్తున్న రైతులతో చర్చలు జరిపారు. ఈకేవైసీలో నమోదైన ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో రైతులు శాంతించారు. కేశవరం గ్రామంలో 2,150 ఎకరాల్లో వరిపంట సాగుచేశారు. ఇప్పటివరకు 1,170 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. ఇక్కడ ధాన్యం ఉత్పత్తి 7,700 మెట్రిక్ టన్నుల మేర ఉత్పత్తి అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు రైతుల నుంచి కేవలం ఆర్ఎస్‌కే ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం 2,640 మెట్రిక్ టన్నులు మాత్రమే. కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు. అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



లీప్ ...రిలీఫ్

- ఇకపై అన్నీ ఒకే యాప్ ద్వారా నమోదు
- అమల్లోకి తెచ్చిన విద్యా శాఖ
- హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం
- ఉపాధ్యాయులపై తగ్గిన భారం

> యాప్‌ల భారంతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు ఊరటనిస్తూ కూటమి ప్రభుత్వం లెర్నింగ్ ఎక్సలెన్సీ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరిట నూతన యాప్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఉపాధ్యాయుల హాజరు నమోదు చేయాలని ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా విద్యా శాఖ అధికారుల ఆదేశాలతో ఉపాధ్యాయులు నూతన యాప్ ద్వారా తమ హాజరును నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించారు.

తొండంగి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో... ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనులు, విద్యార్థులకు కిట్ల పంపిణీ... ఇలా ఒక్కో దానికీ ఒక్కో యాప్ ఉండేది. వాటి పాస్‌వర్డ్‌లను గుర్తించుకుని లాగిన్ అవ్వడం టీచర్లకు తలకు మించిన భారంగా ఉండేది. అంతేగాక ఉపాధ్యాయుల వివరాలను సీఎస్‌సీ ద్వారా నమోదు చేయాల్సి వచ్చేది. విద్యా సంవత్సరంలో సుమారు 30కి పైగా యాప్‌లను వినియోగించాల్సి వచ్చేది. యాప్‌ల భారం తగ్గించండి మహాప్రభో అంటూ ఉపాధ్యాయులు మొత్తుకున్నా అప్పటి ప్రభుత్వం చెవికెక్కలేదు. యాప్‌ల భారం తగ్గిస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్ కూడా ఒకే యాప్ ద్వారా పాఠశాలకు చెందిన అన్ని విషయాలను నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు 'లీప్' యాప్‌ను రూపొందించారు.

లీప్ యాప్‌లో అంశాలివే...

గతంలో ఉన్న సిమ్స్ యాప్ పాస్‌వర్డ్, యూజర్ నేమ్ ఉపయోగించి లీప్ యాప్‌తో లాగిన్ అవ్వొచ్చు. లాగిన్ అయ్యాక స్టూడెంట్, డిపార్ట్‌మెంట్ అనే రెండు టెయిల్స్ కనిపిస్తాయి. దీనిలో డిపార్ట్‌మెంట్‌పై క్లిక్ చేస్తే ఆరు అంశాలు కనిపిస్తాయి. స్కూల్, టీచర్, కమ్యూనికేషన్, స్టూడెంట్, గవర్నెన్స్, డేష్ బోర్డు డిస్‌ప్లే అవుతాయి.

వీటిలో టీచర్‌పై క్లిక్ చేస్తే టీచర్ ప్రొఫైల్ ఓవర్ వ్యూ, టీచర్ లీడర్‌షిప్ అండ్ ట్రైనింగ్, టచర్ సర్వీసెస్, టీచర్ రిసోర్సెస్ అనే అంశాలు కనిపిస్తాయి. టీచర్ సర్వీసెస్‌లో అటెండెన్స్ అనే టెయిల్ ద్వారా హాజరువేయవచ్చు. ఇదే టెయిల్‌లో లీవ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పొందుపరిచారు.

గవర్నెన్స్ విభాగంలో సీఎస్‌సీ, సమగ్ర శిక్షా, మిడ్‌డేమీల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు. గతంలో ఉన్న ఐఎంఎంఎస్ యాప్ మిడ్‌డే మీల్ విభాగంలో ఓపెన్ అయ్యి మధ్యాహ్న భోజన పథకం ఫొటోలు అప్‌లోడ్ చేసే వీలు కల్పించారు. దీంట్లోనే బాత్‌రూమ్‌ల తనిఖీని నమోదు చేసే టీఎంఎఫ్‌ను కూడా జత చేశారు. సమగ్ర శిక్షా విభాగంలో పాఠశాల కమిటీ, తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర, కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లను పొందుపరిచారు.

సీఎస్‌సీ విభాగంలో హెచ్‌ఎం అప్రూవల్, టీచర్ ఇన్‌ఫర్మేషన్ అంశాలు ఉన్నాయి. దీనిద్వారా నేరుగా ఉపాధ్యాయులు తమ సమాచారాన్ని సీఎస్‌సీ సైట్‌లోకి వెళ్ల కుండానే నమోదు చేసే వీలుంది.



స్టూడెంట్ విభాగంలో స్టూడెంట్ ప్రొఫైల్ ఓవర్ వ్యూ, పెర్ఫార్మెన్స్ ఎన్‌టైటిల్‌మెంట్, యాక్షన్స్ అనే విభాగాల ద్వారా విద్యార్థులకు సంబంధించిన అంశాలను నమోదు చేసే వీలుకల్పించారు.

డ్యాష్ బోర్డు విభాగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎండిఎం తీసుకున్న వారి సంఖ్య, అసెస్‌మెంట్, అపార్ స్థితి, ఆధార్ నమోదు, విద్యార్థుల బదిలీలు, విద్యా కమిటీ, తల్లిదండ్రుల కమిటీల సమావేశాల సంఖ్య, శాతం తదితర అంశాలను పొందుపరిచారు.

విద్యార్థి విభాగంలో విద్యార్థి అపార్ నెంబర్‌తో లాగిన్ అయ్యి ఆ విద్యార్థికి సంబంధించిన అన్ని అంశాలను దాని ద్వారా తెలుసుకునే విధంగా లీప్ యాప్‌ను రూపొందించారు. మరికొన్ని విభాగాలకు సంబంధించిన సమాచారం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్టు డిస్‌ప్లే అవుతోంది. ఉపాధ్యాయుల ప్లే స్లిప్, మెడికల్ బిల్లుల స్థితి తదితర అంశాలు దీనిలో ఉన్నాయి.

మొత్తానికి అనేక యాప్‌ల గోల లేకుండా ఒకే యాప్ ద్వారా పాఠశాలకు చెందిన అన్ని అంశాలు నమోదు చేసే అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు చెప్తున్నారు.


సత్యసాయి శ్రీనివాస్


దేవిడ్ జాన్సన్

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 23 మంది అర్హత పొందారని, కె.సత్యసాయి శ్రీనివాస్ భగవాన్ 77వ ర్యాంకు, డేవిడ్‌జాన్సన్ దేవి 2948 ర్యాంకు సాధించారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి డీఈ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.




పిచ్చుక గూళ్లు

ఎండలు మండిపోతున్నాయి... మనుషులే కాదు పక్షులు కూడా వేసవి తాపాన్ని తట్టుకోలేకపోతున్నాయి... అందుకే ఈ పిచ్చుకలు ఎండ నుంచి రక్షణకు తాటి చెట్ల చెంత గూడు ఏర్పరచుకుంటున్నాయి... కాకినాడ జిల్లా గొల్లప్రోలు జాతీయ రహదారి పక్కన ఓ తాటిచెట్టుకు కనిపించిన పిచ్చుక గూళ్లను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ




స్కేటింగ్‌లో దూసుకెళుతూ..


కరాటేలో శిక్షణ పొందుతూ...

ఆడుతూ.. పాడుతూ...

వేసవి శిక్షణ తరగతులకు వేళాయె
కాకినాడలో వివిధ అంశాల్లో పిల్లలకు శిక్షణ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు వస్తున్నాయ్.. ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. మరికొన్ని రోజుల్లో పదో తరగతి ఫలితాలు కూడా వెలువడనున్నాయి. ఒకటి నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నాయి. ఈనెల 23లోపు దాదాపు అన్ని తరగతులకు పరీక్షలు పూర్తి కానున్నాయి. అయితే రానున్న వేసవి సెలవులను ఎలా వినియోగించుకోవాలి అనే ఆలోచనలో విద్యార్థులు ఉన్నారు. కొందరు ఆటపాటలతో సరదాగా సెలవులను ఎంజాయ్ చేస్తే.. మరికొందరు మాత్రం తమ అభిరుచి మేరకు ఇష్టమైన రంగంలో శిక్షణ పొందేందుకు సిద్ధమవుతున్నారు. వారి ఆసక్తికి తగ్గట్టుగానే కాకినాడ నగరంలో పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో...

పిల్లలకు ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు శిబిరాల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మే ఒకటో తేదీ నుంచి నెల పాటు వివిధ క్రీడాంశాల్లో చిన్నారులకు తర్ఫీదు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. డీఎస్‌ఏ మైదానంతో పాటు కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, మైదానాలు, ఇతరచోట్ల శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 50 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలకు రూ.3.50 లక్షలు కేటాయిస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. క్రీడా సామగ్రికి రూ.ఐదు వేలు, శిక్షకుడికి రూ.1,500, ఇతరత్రా వాటికి రూ.500 ఖర్చు చేయనున్నారు. ఇక్కడ క్రికెట్, టైక్వాండో, అథ్లెటిక్స్, ఆర్చరీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, జూడో, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, యోగా, టేబుల్ టెన్నిస్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, హాకీ... ఇలా 23 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. వేసవి శిబిరాలకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో 'శాప్' నుంచి ఉత్తర్వులు రాగానే కలెక్టర్ షాన్ మోహన్ అనుమతితో దరఖాస్తులు స్వీకరిస్తామని డీఎస్‌డీవో బి.శ్రీనివాస కుమార్ తెలిపారు.


బాల భవన్‌లో సంగీత సాధన చేస్తూ...

బాల భవన్‌లో...

కాకినాడ గాంధీనగర్‌లోని బాల భవన్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు కరాటే, సంగీతం, వయోలిన్, గాత్రం, మృదంగం, చిత్రలేఖనం అంశాల్లో శిక్షణ ఇస్తారు. 6-16 ఏళ్ల మధ్య వయసు పిల్లలు వారికి నచ్చిన అంశాల్లో శిక్షణ పొందవచ్చు. వేసవిలోనే కాదు.. సాధారణ రోజుల్లోనూ ఇక్కడ పలు అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నట్టు బాలభవన్ పర్యవేక్షకురాలు ఎ.శారద తెలిపారు.

నగరంలో పలుచోట్ల వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. రాజా ట్యాంక్ ఆవరణలోని స్కేటింగ్ రింక్‌లో ఇప్పటికే వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. చిన్నారులకు స్కేటింగ్‌లో సుమారు నెల పాటు మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తున్నారు. ఇటీవలి కాలంలో చాలా మందికి ఆంగ్లంలో మాట్లాడటంపై ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో కచేరీపేటలోని సుందరయ్య భవన్‌లో ప్రతిరోజూ సాయంత్రం 6-7 గంటల మధ్య స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ ఇస్తున్నారు.



బాల భవన్‌లో వయోలిన్, మృదంగం శిక్షణ పొందుతున్న విద్యార్థులు


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ఆదిత్య' ప్రభంజనం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో జాతీయ స్థాయి ఉత్తమ ర్యాంకులతో 'ఆదిత్య' ప్రభంజనం సృష్టించింది. అఖిల భారత స్థాయిలో కె.రుత్విక్ (23), పి.ఆదిత్య అభిషేక్ (46), వైపీ వీరసూర్య చక్రపవన్ (109), ఎం.జయచంద్ర (111), కె.సాయిశ్రీహిత్ (112), కె.వర్థికసాయి (118), పీడీ నాగలక్ష్మి (135), వై.లక్ష్మీకీర్తన (144), సీహెచ్ సాయిర్షిత్ (155), బి.పూజిత (206), కె.ప్రకాష్ రాజ్ (212), జి.శ్రీరామశశాంక్ (280), పి.కృష్ణ భార్గవ్ (300), ఎస్.శ్రీలేఖ (309), టి.యశ్వంత్ (342), వైఎస్ శ్రీవల్లీఆత్రేయి (359), ఆర్.భరత్ నారాయణ్ (395) ర్యాంకులను వివిధ కేటగిరీల్లో సాధించినట్టు ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. అఖిల భారత స్థాయిలో అన్ని కేటగిరీల నుంచి 100లోపు 2, 500లోపు 17, 1000లోపు 27, 2000లోపు 44, 5000లోపు 102 మంది విద్యార్థులు ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. జాతీయ, అఖిల భారత స్థాయిల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి, డైరెక్టర్లు సుగుణ, శృతి, ప్రిన్సిపాల్ మొయినా, సమన్వయకర్త లక్ష్మీకుమార్, అకడమిక్ డైరెక్టర్ రాఘవరెడ్డి, గంగిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఐఐటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఫణీంద్ర అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' విజయభేరి

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు తిరుల విద్యా సంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కె.ప్రణీత్ (2), కె.యశ్వంత్ సాత్విక్ (3), పి.శరత్ సంతోష్ (9), వి.తేజశ్రీ (18), టి.జశ్వంత్‌దొర (30), కె.అభినవ్ (45), కె.యశ్వంత్‌రాజా (46), జి.సంతోష్‌రాజా (66), ఇ.వర్షిత్ (75), ఎం.కారుణ్యరాజ్ (86), కె.వెంకటరామ వినీష్ (100), జి.కార్తీక్ (120), వి.రామ సాయి వరుణ్ (153), జి.చేతన్ నాగఅనిరుధ్ (154), కె.శంకర్ మాణిక్ (191), పి.జశ్వంత్‌సాయి చరణ్ (219), ఎం.విశ్వనాథ నాగసాయిరామ్ (224), డి.ఆశిష్‌సాయి శ్రీకర్ (235), కె.సాయి సృజన (236), సీహెచ్ సాయిచరణ్ (242), వై.దేవేష్ రుత్విక్ (246), పి.ప్రవీణ్ రుద్రేష్ (247) ర్యాంకులు సాధించారు. వీరితో పాటు పలువురు 292, 310, 313, 319, 326, 331, 338, 349, 366, 391, 395, 403, 429, 444, 465, 473 ర్యాంకులు పొందారు. 1000లోపు 58, 5000లోపు 254, 10000లోపు 417, 20000లోపు 654 మందికి ర్యాంకులు వచ్చాయి. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 1,620 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొంది 93శాతం సక్సెస్ రేటు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్లతో కలిసి తిరుమలరావు అభినందించారు.



అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ తిరుమలరావు

రెలిజియస్ చారిటబుల్ సంస్థగా సత్యదేవుడి ఆలయం రిజిస్ట్రేషన్

దాతలకు 80 (జి), 12 (ఎ) ఆదాయపు పన్ను మినహాయింపు

అన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి ఆలయానికి రెలిజియస్, చారిటబుల్ ట్రస్టుగా రిజిస్ట్రేషన్ కల్పించారు. దీంతో ఇప్పటికే 80(జి) ద్వారా ఆదాయపు పన్ను మినహాయింపు ఉండగా ఇకపై 12(ఎ) ఆదాయపు పన్ను చట్టం కలిగి ఉంటుంది. దాతలు వివిధ సేవా పథకాల నిమిత్తం విరాళాలు అందించి ఆదాయపు పన్ను మినహాయింపు పొందవచ్చని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీర్ల సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గోవిందా... గోవింద

వాడపల్లికి పోటెత్తిన భక్తులు
శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.47.18 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగంలను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.47.18 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

వాడపల్లి క్షేత్రానికి హైకోర్టు జడ్జి టి.రాజశేఖరరావు విచ్చేశారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.


ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కార్మికులకు దన్ను 'ఈ-శ్రమ్'

- ఉచితం.. ఆటో రెన్యూవల్
- స్వీయ నమోదుకు అవకాశం
- ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రత్యేక నమోదు
- సంక్షేమ, సామాజిక భద్రత కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రెక్కాడినా డొక్కాడుతుందని నమ్మకం లేని బతుకులు. ఆ రోజు చేతికి పని దొరికితే నాలుగు మెతుకులు కడుపులోకి వెళ్లినట్లే. పని చేసినంతకాలం అప్పుల జీవితం. కళ్లు మూశాక కుటుంబాలకు కరువయ్యే ఊతం. ఆసరా కోసం ఆశగా చాపే చేతులు.. వారే అసంఘటిత రంగ కార్మికులు. కష్టాలతో సహవాసం.. కన్నీళ్ల జీవితం. ప్రభుత్వాలు విపత్తుల వేళ ఆదుకోవాలన్నా ఇంత కాలం ఆయా కార్మికుల గురించి ఎలాంటి సమాచారం లభ్యత లేదు. అసలు వాళ్లను ప్రత్యేకంగా పట్టించుకున్న వారే లేరు. అయితే.. వారికి భవిష్యత్తులో దన్ను కాబోతోంది 'ఈ-శ్రమ్' కార్డు. కరోనా విపత్తు వేళ అసంఘటిత రంగ కార్మికులను ఆదుకుందామన్నా ప్రభుత్వాలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటిని అధిగమించడానికి, సామాజిక భద్రత కల్పించి, సంక్షేమ పథకాల్లో మరింతగా భాగస్వాములను చేయడం ద్వారా వారి బతుకుల్లో వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్రీకృత డేటా బేస్‌ని రూపొందిస్తోంది. తర్వాత పలు విధాలుగా లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. అందువల్ల 'ఈ-శ్రమ్' కార్డు.. భవిష్యత్తులో కార్మికులకు దన్ను కాబోతున్నాయనడంలో సందేహం లేదు. ఈ కార్డు పొందడానికి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పైగా ఆటో రెన్యూవల్ సదుపాయం వల్ల రెన్యూవల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు.

ఎవరు అర్హులు?

16-59 ఏళ్ల మధ్య వయసు కలిగిన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇటుక, సున్నపు బట్టీ కార్మికులు, మత్స్యకారులు, కుమ్మరి, స్వర్ణకారులు, మంగళి, చర్మకారులు, రజకులు, ఉపాధి కూలీలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన పథక వర్కర్లు, ఇళ్లల్లో పని చేసేవారు, వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు, కల్లుగీత కార్మికులు, రిక్షా కార్మికులు, కళాకారులు, బీడీ కార్మికులు, చెత్త సేకరించే వారు, దుకాణాలు, సంస్థల్లో పని చేసే కార్మికులు, వలస కార్మికులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని వారు ఇందుకు అర్హులు.

ఎక్కడ.. ఏమి కావాలి?

ఈ-శ్రమ్ కార్డు కోసం సరమళమైన మోదు ప్రక్రియ ఉంటుంది. కాబట్టి సొంతగా చేసు కోవచ్చు. లేదా అన్ని గ్రామ/వార్డు సచివాలయాలు, సీఎస్‌సీ సెంటర్లు, కార్మిక శాఖ కార్యాల యాల్లోనూ నమోదు చేసుకో వచ్చు. నమోదు కోసం ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు జిరాక్సు, సెల్‌ఫోన్ నెంబరు, నామినీ పేరు, పుట్టిన తేదీ వివరాలు ఉంటే సరిపోతుంది.

సాధారణ కార్మికులకు ప్రయోజనం..

ప్రయోజనాలు 2022 మార్చి 31కి ముందు నమోదైన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.2లక్షల ఆర్థిక సహాయం అందుతుంది. పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.1లక్ష వస్తుంది. రేలషన్ కార్డు లేని వారికి వాటిని జారీ చేస్తారు. వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు ఉంటాయి.

ప్లాట్‌ఫాం వర్కర్లకు ప్రత్యేకంగా..

ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, యాప్‌ల ఆధారంగా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వీరిని జిగ్ వర్కర్లని కూడా అంటారు. అయితే వారికి ఏదైనా ప్రమాదం ఎదురైతే ఆదుకొనే వారు ఎవరూ ఉండరు. కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంది. ఇటీవల కొంతమూరులో ఓ బైక్ షేర్ యాప్ వర్కర్‌కి రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణాలు వదిలాడు. ఇన్సూరెన్స్ వంటివి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే ఈ-శ్రమ్ కార్డు పొంది ఉంటే రూ.5లక్షల బీమా సొమ్ము వచ్చేది. అంతే కాకుండా వీరిని ప్రత్యేకంగా ఆదుకొనే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. అయితే, వీరి కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లోనే ప్రత్యేక నమోదు లింక్‌ని ఉంచారు. సాధారణ కార్మికుల మాదిరిగా నమోదు చేసుకోకూడదు. ప్లాట్‌ఫాం వర్కర్ల రిజిస్ట్రేషను ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలి. అమె జాన్, స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, ర్యాపిడో, ఉబర్, ఓలా, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ వంటి వాటిలో పని చేస్తున్న వారందరూ అర్హులే కాకుండా రూ.5లక్షల వరకూ బీమా సదుపాయం ఉంది. వీళ్ల రిజిస్ట్రేషన్‌కి ఈ-శ్రమ్ పోర్టల్‌లో 'ప్లాట్ ఫాం వర్కర్ కార్డు' అని కనిపిస్తుంది. దాని ద్వారా వివరాలను నమోదు చేసి కార్డు పొందవచ్చు.

ప్రతి కార్మికుడికీ ఉండాలి

ప్రతి కార్మికుడూ, ప్లాట్‌ఫాం వర్కర్ 'ఈ-శ్రమ్' కార్డును పొందాలి. చాల సులభమైన ప్రక్రియ. ఎవరికి వారు నమోదు చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ 3.50లక్షల మంది రిజిస్ట్రేషను చేసుకున్నారు. మిగతా వారు కూడా వెంటనే నమోదు చేసుకోవాలి. వారి సహ కార్మికులు కూడా నమోదు చేసుకొనే విధంగా చొరవ చూపాలి. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. నమోదుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం.

బీఎస్ఎం వలీ, సహాయ కార్మిక కమిషనర్, తూర్పు గోదావరి

సందేహాలకు ఫోన్ నెంబర్లు

ఏదైనా సందేహాలు ఉంటే 9492555064 /65/66/67 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

నమోదు చాలా సులభం...

ఈ-శ్రమ్ కార్డు కోసం నమోదు చేసుకోవడం చాలా సులభం. అధికారిక వెబ్‌సైటు https://eshram.gov.inలో సెల్ ఫోన్ నెంబరుతో లింక్ అయి ఉన్న ఆధార్ నెంబరు, అక్కడే కనబడే కేప్చా కోడ్ నమోదు చేయాలి. ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐపై నో అని ఎంచుకొని సెండ్ ఓటీపీపై క్లిక్ చెయ్యాలి. సెల్ నెంబరుకు వచ్చిన ఓటీపీ నెంబరును ఎంటర్ చేసి టెర్మ్స్ అండ్ కండీషన్స్ బాక్స్‌ని టిక్ చేసి సబ్మిట్ చేయాలి. మళ్లీ వచ్చిన ఓటీపీని, కాప్చా కోడ్‌ని ఎంటర్ చేసి వ్యాలిడేట్ బాక్స్‌పై క్లిక్ చేసి కంటిన్యూ టు ఎంటర్ అదర్ డిటైల్స్ బాక్స్‌పై కూడా క్లిక్ చేసి వివరాలు నమోదు చెయ్యాలి. నామినీ డిటెయిల్స్ అని వస్తుంది. వివరాలు ఇచ్చినా ఇవ్వకపోయినా ఫర్వాలేదు. సేవ్ అండ్ కంటిన్యూ తర్వాత స్టేట్, డిస్ట్రిక్ట్, ప్రస్తుత అడ్రస్, స్టేయింగ్ ఎట్ కరెంట్ లొకేషన్, పర్మనెంట్ అడ్రస్‌ల, చదువు, నెలవారీ ఆదాయం, వృత్తి, నైపుణ్యాలు, ప్రాథమిక వృత్తి, వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను తప్పనిసరిగా నమోదు చేసి సేవ్ అండ్ కంటిన్యూ బటన్ నొక్కాలి. బ్యాంక్ డిటెయిల్స్ ఇవ్వడం తప్పనిసరికాదు. తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తయి ప్రివ్యూ అని వస్తుంది. మార్పులు ఉండే ఎడిట్ బటన్ ద్వారా చేసుకోవచ్చు. లేదా అండర్ టేకింగ్ బాక్సులో టిక్ చేసి సబ్మిట్ చేసేసి 'ఈ-శ్రమ్' కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ముమ్మిడివరంలో సమీక్షా సమావేశం

ఆర్డీ నాగనరసింహారావు

మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పన్నులు సకాలంలో వసూలు చేసి మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరిస్తూ అదేస్థాయిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, మండపేట, రామచంద్రపురం, కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల కమిషనర్లు, ఆయా పురపాలక సంఘ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగనరసింహారావు మాట్లాడుతూ పట్టణాల్లో ఆదాయ వనరుల పెంపు, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించి కౌన్సిల్ ఆమోదంతో ముందుకు సాగాలని సూచించారు. ఆస్తి పన్ను, తాగునీరు, ట్రేడ్ లైసెన్సు పన్నులు నూరుశాతం వసూలు పూర్తి చేయాలన్నారు. ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీని కల్పించిన విషయంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. పట్టణాలకు ఆదాయం వచ్చే భవనాలు, ఇతర ఆదాయ వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఘన, ద్రవ, వ్యర్థాల నిర్వహణ, భూసంబంధిత సమస్యలపై ఆయన సమీక్షించారు. అమృత్, ఇతర పథకాల పురోగతి బడ్జెట్ అంచనాల ప్రకారం ఆదాయ వ్యయాలను పురపాలక సంఘాల వారీగా ఆర్డీ సమీక్షించారు. పట్టణాల సుందరీకరణ, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా సక్రమంగా ప్రజలకు అందించాలన్నారు. పట్టణ ప్రణాళికావిభాగం పనితీరు, సమస్యలపై సమీక్షించి పలుసూచనలిచ్చారు. ఈ ఆఫీసు ఆచరణ విధిగా నిర్వహించాలన్నారు. మురుగుకాల్వల్లో పూడిక తొలగింపు, పట్టణాల్లో ఎంఎస్ఎంఈ కార్యాచరణ, కుటుంబాల గుర్తింపు తదితర విషయాలపై చర్చించారు. వీధి కుక్కలు, పశువుల నిర్మూలనకు చర్యలు, వార్డు సచివాలయ సర్వే రిపోర్టు, హౌస్ హోల్డ్ సర్వే, ఆధార్‌లేని పిల్లకు ఆధార్ చేయించడం తదితర విషయాలపై సమీక్షించారు. సమావేశంలో ముమ్మిడివరం, అమలాపురం, రామచంద్రపురం, కొవ్వూరు, మండపేట, నిడదవోలు కమిషనర్లు పి.రవివర్మ, కేవీఆర్ రాజు, వి.అయ్యప్పనాయుడు, టీవీ రంగారావు, పీఎల్ఎస్ఎస్ కృష్ణవేణిలతో పాటు మున్సిపాలిటీల డీఈలు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మేనేజర్లు, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్లు, రెవెన్యూ, శానిటరీ ఇనస్పెక్టర్లు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగనరసింహారావు



సమావేశంలో పాల్గొన్న కమిషనర్లు, అధికారులు

పోలీసులు స్వాధీనం చేసుకున్న

454 సెల్‌ఫోన్లు అందజేత



కాకినాడలో మహిళకు ఫోన్ అందజేస్తున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఖరీదైన సెల్‌ఫోన్లు

కాకినాడ క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అపహరణకు గురైన లేదా పోగొట్టుకున్న రూ.77.18 లక్షలు విలువైన 454 ఖరీదైన సెల్‌ఫోన్లను కాకినాడ జిల్లా పోలీసులు రికవరీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం వాటిని బాధితులకు ఎస్పీ జి.బిందుమాధవ్ అందజేశారు. ప్రస్తుతం అందజేసిన సెల్‌ఫోన్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం 2,551 రికవరీ చేశామని, మరో నెలలో ఇంకె 600 వరకు బాధితులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సైబర్ మోసాల నుంచి రక్షణ కోసం వీడియో కాల్స్ ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ క్రైం హెల్ప్ లైన్ 1930 లేదా పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు. వేసవి నేపథ్యంలో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

దీక్ష విరమణకు బీచ్‌కు వెళ్లి.. సముద్రపు నీటికి ఉక్కిరిబిక్కిరై..

ఒడ్డుకు వచ్చి చికిత్స పొందుతూ యువకుడి మృతి

ప్రాణాలతో బయటపడిన మరో ఇద్దరు



ఫైల్‌ఫొటో



మృతిచెందిన ఉదయ్‌కుమార్

మొగల్తూరు/నల్లజర్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం బీచ్‌కు దీక్ష విరమణకు వెళ్లిన ఓ యవకుడు మృతిచెందాడు. వివరాల ప్రకారం.. ఏటా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు 40 రోజుల పాటు దీక్ష చేసి గుడ్‌ఫ్రైడే రాత్రి సమయంలో పేరుపాలెం తీరంలోని వేళాంకిణ్ణి మాత ఆలయం వద్ద దీక్ష విరమణ చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది శుక్రవారం రాత్రి వచ్చిన సందర్శకుల్లో శనివారం వేకువజామున సముద్ర స్నానానికి దిగిన ఇద్దరు యువకులు ఎక్కువ సముద్రం నీరు తాగడంతో ఉక్కిరిబిక్కిరికి లోనై ఒడ్డుకు ప్రాణాలతో కొట్టుకువచ్చారు. వారిలో ఒక యువకుడు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన సంకెళ్ల ఉదయ్‌కుమార్(19). అతడిని స్థానికులు, పోలీస్ సిబ్బంది మొగల్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉండడాన్ని గుర్తించి నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేస్తుండగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇదే సంఘటనలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి సికింద్రర్‌ను నరసాపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొంది సాయంత్రం ప్రకాశరావు పాలెం వచ్చాడు. అదేవిధంగా తూర్పు గోదావరి జిల్లా ఆవపాడు చెందిన యువకుడు కోడే పవన్ కుమార్ కూడా నీటిలో మునగడంతో నరసాపురం ఆసుపత్రికి, మెరుగైన వైద్య నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఉదయ్‌కుమార్ తండ్రి చిన్నతనంలోనే మృతిచెందగా తల్లి విజయలక్ష్మి ఆలనాపాలన చూస్తోంది. మృతుడి అక్క విజయలక్ష్మి ఫిర్యాదుతో మొగల్తూరు 2వ ఎస్ఐ వై.నాగలక్ష్మి కేసు నమోదు చేశారు.

సాంస్కృతిక పునరుజ్జీవనానికి గ్రంథాలయాలు దోహదం

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక పునరుజ్జీవనానికి గ్రంథాలయాలు దోహదపడతాయని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడియల్ డిగ్రీ కళాశాలలో ఏపీ గ్రంథాలయ పునర్వికాస వేదిక, ఐడియల్ కళాశాల శనివారం సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మార్గదర్శకాలు కల్పించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఏపీ గ్రంథాలయ పునర్వికాస వేదిక కన్వీనర్ వి.శివప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 27న విజయవాడలో జరిగే సభలో కవులు, రచయితలు, మేథావులు పాల్గొని గ్రంథాలయాల సమస్యల పరిష్కారానికి డిమాండ్లు తెలియజేయాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షురాలు డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, సూర్యభాస్కర్, సుబ్బరాజు, సుబ్బారావు, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

టెన్త్ ఫెయిల్ అవుతాననే భయంతో..

విద్యార్థిని ఆత్మహత్య

అంబాజీపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలు సరిగ్గా రాయలేదని మార్కులు తక్కువ వస్తాయనే భయంతో ఓ విద్యార్థిని శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ కె.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మం డలం గంగలకుర్రు పరిధిలోని 15 ఏళ్ల బాలిక ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలు రాసింది. పరీక్ష ఫలితాలు త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో తక్కువ మార్కులు వచ్చి ఫెయిల్ అవుతాననే భయంతో ఇంటి వద్దే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందింది. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

బాలికను వేధించిన యువకుడిపై పోక్సో కేసు

ద్రాక్షారామ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం జగన్నాయకుల పాలెం గ్రామానికి చెందిన యువకుడిపై ద్రాక్షారామ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ప్రకారం.. ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, తన కోరిక తీర్చమని వేధించడంపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

10 కిలోలు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ సమీపంలో నలుగురిని అదుపులోకి తీసుకుని పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఒడిస్సాకు చెందిన రాజ్‌రాయ్, మందోష్ మండల్‌లు, రాజమహేంద్రవరానికి చెందిన దొండా మల్లేశ్వరరావు, దొండా కొండల రావు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి పది కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

జనావాసాల్లోకి కొండ గొర్రె

స్వల్ప గాయాలు



గాయపడిన కొండ గొర్రె

మారేడుమిల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అటవీప్రాంతం నుంచి మారేడుమిల్లి గ్రామంలోకి కొండ గొర్రె వచ్చింది. గ్రామంలో సీఎస్ఐ చర్చి సమీపంలో కుక్కలు తరుముకుంటూ రావడంతో గొర్రెకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వడంతో సంఘటా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి సమీపంలోని అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలిపెట్టారు.

బుర్రిలంకలో తాటాకిల్లు దగ్ధం

కడియం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలో పంతాల కొండారత్నంకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. దుస్తులు, సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో రాజమహేంద్రవరం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలిసి సర్పంచ్ ఇన్‌చార్జి పాటంశెట్టి రాం జీ రూ.10 వేల అందించారు. అలాగే నూనె ప్రభు ఆర్థిక సాయం చేశారు.



కాలిబూడిదైన దృశ్యం

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య



మరణించిన సాయికుమార్

కొవ్వూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం అందించిన వివరాల ప్రకారం.... తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన లంక నాగ శ్రీసత్య సాయికుమార్ (22) సూరంపాలెంలోని ఓ కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సాయికుమార్ తల్లికి ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించడంతో తల్లితండ్రులు గత కొద్ది రోజులుగా కొవ్వూరు పట్టణంలోని తన కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయం త్రం సాయికుమార్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయికుమార్ స్నేహితుడు శ్యాంసన్ ఇంటికి వచ్చి పిలవగా ఎంతకీ పలకకపోవడంతో కిటికీలోంచి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

రూ.2,91,596 ఆదాయం

పెద్దాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభస్వామిని శనివారం సుమారు పదిహేను వేలమంది దర్శించుకున్నారు. రూ.2,91,596 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. తుని మండలం రాజుపేటకు చెందిన అల్లు రామకృష్ణ, అరుణ స్వామివారికి 2.690 కిలోల వెండి ఆభరణాలు సమర్పించినట్టు ఆయన చెప్పారు.

పాస్టర్ ప్రవీణ్ మరణించిన ప్రదేశంలో

కొవ్వొత్తులతో క్రైస్తవుల నిరసన ర్యాలీ





కొంతమూరు రోడ్డులో ర్యాలీ చేసి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణించిన ప్రదేశం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు-దివాన్ చెరువు రోడ్డులో క్రైస్తవులు కొవ్వొత్తులతో భారీ నిరసన ర్యాలీ చేశారు. ప్రవీణ్ మరణం హత్యే అని నమ్మినవాళ్లు ఈ ర్యాలీలో పాల్గొనాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం సాయంత్రం వేలాది మంది క్రైస్తవులు ప్రవీణ్ మరణించిన సంఘటన స్థలానికి చేరుకుని కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. ఆ ప్రాంతానికి చేరుకున్న మాజీ ఎంపీ హర్షకుమార్, ఆయన తనయుడు జీవి శ్రీరాజ్, జిల్లాలోని రాజమహేంద్రవరం, ఇతర ప్రాంతాలు, తెలంగాణ నుంచి వచ్చిన పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేస్తుండగా హర్షకుమార్‌ను, నాయకులు ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకట రత్నం, జంగా బాబురావు, పాలకొల్లుకు చెందిన రమేష్‌ని పోలీసులు అదుపులోకి తీసుకుని కొంతమందిని రాజానగరం పోలీస్ స్టేషన్‌కు, మరి కొంతమందిని ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారు. క్రైస్తవులు బారికేడ్లను తోసుకుని నేరుగా ప్రవీణ్ పగడాల మరణించిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రవీణ్ ఫ్లెక్సీ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. నివాళులర్పించారు. ముగ్గురు డీఎస్పీలు, ముగ్గురు సీఐలు వంద మందికి పైగా పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితి అదుపు తప్పకుండా వ్యవహరించారు. హర్షకుమార్‌ను వేమగిరి వైపు తీసుకువెళ్లి తిరిగి ఇంటి వద్ద దించేశారు. అయితే ఆయన నిర్వహించిన కొవ్వొత్తుల నిరసన ర్యాలీకి అనుమతిలేదని రాజానగరం పోలీసులు నోటీసులు ఇచ్చారు.

ఫ్లెక్సీ వద్ద నివాళి

మాజీ ఎంపీ హర్షకుమార్ అరెస్ట్, విడుదల

పోరాటం ఆగదు : హర్షకుమార్

పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మార్చి క్రైస్తవులకు అన్యాయం చేస్తే దానిని నిలదీసి కొవ్వొత్తుల ర్యాలీ చేసి నివాళులర్పించేందుకు వెళ్లిన తనను వంద మంది పోలీసులతో అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. శనివారం రాత్రి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల కంటే దారుణం ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. అరెస్టులకు భయపడని తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు

కోడి గుడ్డుపై ఏసుక్రీస్తు చిత్రం

రాయవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు పునరుత్థానాన్ని పురస్కరించుని నిర్వహించే ఈస్టర్ పండగ సందర్భంగా శనివారం కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇందుగమెల్లి సొదాసాగర్ కోడి గుడ్డుపై ఏసుక్రీస్తు చిత్రం గీశాడు. వివిధ రకాల రంగులతో సుమారు 2 గంటల పాటు శ్రమించి చిత్రీకరించాడు.



కోడిగుడ్డిపై సొదాసాగర్ గీచిన ఏసుక్రీస్తు చిత్రం

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

అంబాజీపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేసిన ఉపాధ్యాయులకు ఎల్లప్పుడు మంచి గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జడ్పీ హైస్కూల్ స్కూల్‌అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన బొక్కా వెంకటేశ్వరరావు సన్మాన సభ జరిగింది.

ఆర్టీసీ డిపోలో స్వచ్ఛాంధ్ర..

రాజోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రాజోలు డిపోలో శనివారం స్వచ్ఛాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారులను ప్రోత్సహించాలి

- ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన శనివారం జరిగిన విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల పంపిణీలో వారు మాట్లాడారు. డీఈవో షేక్ సలీంబాషా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉదన్నారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో 328 మంది దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు అందించినట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, పెన్మెత్స జగ్గప్పరాజు, తాడి నరసింహారావు, గుత్తుల సాయి, సమగ్రశిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, సమగ్ర శిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో భ్రష్టు పట్టించడం వల్లే విద్యుత్ సంస్థలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆరోపించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 20వ వార్డు మట్టాడిపాలెంలో రూ.2.82 కోట్లతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వారు శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గానికి ఐదు సబ్‌స్టేషన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మొదటి విడతగా ముమ్మిడివరం, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామాలకు 33/11కేవీ సబ్‌స్టేషన్ మంజూరయ్యాయన్నారు. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సిద్ధిన రాజబాబు, ఈఈ వై.విజయానంద్, డీఈ కె.రాంబాబు, ఏడీ బి.శ్రీనివాసరావు, కనస్ట్రక్షన్ ఏడీ చంద్రశేఖర్, ఏఈ కె.శివచంద్రశంకర్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దాట్ల పృథ్విరాజ్, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, సాగి సూరిబాబురాజు, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, కట్టా సత్తిబాబు, అడబాల సతీష్‌కుమార్, పిల్లి నాగరాజు, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, దంగేటి శ్రీను, కాశి లాజర్, బూరుగు కల్యాణ్, నీతిపూడి వంశీ, తొత్తరమూడి జ్యోతిబాబు, మెండి కమల, గోదశి పుండరీష్ పాల్గొన్నారు.

మున్సిపల్ పాలనా వ్యవహారాల్లో భర్త ప్రమేయమేమిటి?

- అధికారులుగా పనిచేయండి లేదా ఆయన వద్ద పనిచేసుకోండి
- చైర్మన్ భర్త వ్యవహారశైలిపై అధికార వైసీపీ కౌన్సిలర్ల ఆగ్రహం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ స్క్రాప్‌ను వేలం వేయకుండా ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని అధికార పక్ష వైసీపీ కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చెప్పడం వల్లే ఆపామని ఇంజనీరింగ్ అధికారులు చెప్పడంతో వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ భర్త ఆపమంటే ఆపేస్తారా మీరు అధికారులుగా పనిచేయడం నేర్చుకోండి లేదా ఆయన వద్ద పనిచేయడానికి వెళ్లిపోండని వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలలుగా చైరపర్సన్ భర్త వ్యవహార శైలిపై గొడవలు జరుగుతున్నాయని తెలుసు, అయినా ఈఅంశాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకురాలేదని ప్రశ్నించారు. ఇకపై మున్సిపల్ పరిపాలనా వ్యవహారాల్లో భర్త కలగచేసుకుంటే మీపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంతో కాలంగా పడి ఉన్న ఎలక్ట్రికల్ స్క్రాప్‌ను వేలం వేయాల్సిన బాధ్యత మీకులేదా అని మండిపడ్డారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిలర్ సాధారణ సమావేశం శనివారం చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. తొలుత ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్ వ్యర్థాలతో భవిష్యత్తు సమాజానికి విసురుతున్న సవాళ్లను అధిగమిస్తూ ఇప్పటి నుంచి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కమిషనర్ కేవీఆర్‌ఆర్ రాజు వివరించారు. కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అధికారులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి మాట్లాడుతూ ఆప్కాస్ సిబ్బందికి జీతాలు ఎందుకు చెల్లించడంలేదని ప్రశ్నించారు. కమిషనర్ రాజు కల్పించుకుని కూటమి ప్రభుత్వం ఆప్కాస్ విధానంలో తీసుకువచ్చిన మార్పుల వల్లే జాప్యం జరిగిందని, ఇప్పటికే జీతాలను సీఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేశామని, ఈసమస్య రెండు రోజుల్లో పరిష్కారమవుతుందన్నారు. పట్టణంలోని డ్రైనేజీ సమస్య అధ్వానస్థితికి చేరుకుందని, ఎక్కడికక్కడ మురుగునీరు పేరుకుపోయి ముందుకు పారే దారిలేక కుళ్లి కంపుకొడుతుందని అధికార విపక్ష కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, కొల్లాటి దుర్గాబాయి, పడాలశ్రీదేవి తదితరులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఒక దశలో వైసీపీ కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శానిటేషన్ వ్యవస్థ అధ్వానస్థితికి చేరుకుందని, తన వార్డులోని డ్రైన్ల సమస్యను ఎనిమిది నెలలుగా అధికారుల దృష్టికి తీసుకువస్తున్నా పరిష్కరించలేదన్నారు. దాంతో టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మండిపడ్డారు. డ్రైన్ల సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం వరకు వెళ్లనవసరం లేదని స్థానికంగా అధికారులు చేయిస్తే చాలన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈవ్యవహారంలో అధికార విపక్ష కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. విధులు నిర్వహించకుండానే పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లిస్తున్న తీరుపై అధికారపక్ష వైసీపీ కౌన్సిలర్లే ఆగ్రహం వ్యక్తంచేశారు. పురపాలక సంఘ పరిధిలోని ప్రధాన మంచినీటి విభాగం వద్దనున్న 4800 కిలోల పాత స్క్రాప్ మెటీరియల్‌ను డిస్పోజ్ చేసేందుకు తీసుకువచ్చిన అంశంపై అధికారపక్ష వైసీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. కిలో రూ.26కు విక్రయించేలా మేము తీర్మానం చేయాలని అని ప్రశ్నించారు. రూ.20లక్షలతో మంచినీటిని శుద్ధి చేసేందుకు ఆలంను అత్యవసరంగా కొనుగోలు చేయాలని తీసుకువచ్చిన అంశంపై కౌన్సిలర్ బులినాని అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. టన్ను ఆలం ధర రూ.14వేలు అయితే అంత సరుకును ఎక్కడ నిల్వ చేస్తారని, రూ.10లక్షల సరుకును మాత్రమే కొనుగోలు చేసేందుకు ఆమోదం తెలిపారు. మంచినీటి సరఫరా కేంద్రంలో ఆలంను కలిపేందుకు అసలు బెడ్ ఉందా అని టీడీపీ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. అది ఏనాటి నుంచో పనిచేయడం లేదని, ఏనాటి నుంచో ఆలంను నేరుగా నీటిలో కలిపేస్తున్నామని అధికారులు చెప్పడంతో సభ్యులు మండిపడ్డారు. ఏళ్లు గడిచిపోతున్నా ఇంత వరకు బెడ్‌లు నిర్మించలేదని, రూ.8లక్షలతో బెడ్ నిర్మాణానికి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. రూ.32లక్షల అంచనాతో 26వ వార్డు చేపల మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు మెప్మా నిధులు కేటాయించిన అంశంపై బ్లూ ప్రింట్ లేకుండా ఎలా ఆమోదించాలని అధికార పక్ష కౌన్సిలర్లు ప్రశ్నించారు. డిజైన్‌ను మీరు సెల్‌ఫోన్‌లో చూపిస్తే మేము ఆమోదించాలా అని ప్రశ్నించారు. పూర్తి వివరాలతో మళ్లీ సమావేశానికి తీసుకురావాలని వాయిదా వేశారు. పురపాలక సంఘ కార్యాలయం ఎదుట నిర్మిస్తున్న భవనాన్ని షాపుల వారీగా కాకుండా షాపింగ్‌మాల్‌కు ఇవ్వాలని సభ్యులు అధికారులకు సూచించారు. పలుఅంశాలపై కౌన్సిలర్లు యేడిద శ్రీను, బండారు గోవిందు, నాగారపు వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు మాట్లాడారు. చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి వ్యక్తిగత కారణాలతో సమావేశానికి హాజరుకాలేదని తొలుత కమిషనర్ రాజు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైస్‌చైర్మన్‌గా ఉన్న తిక్కిరెడ్డి వెంకటేష్‌ను అధికారపక్ష వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ స్థానం వద్దకు తీసుకువచ్చి సత్కరించారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార విపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం

సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో శనివారం ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లంతా ఒక్కరోజు ధర్నా, నిరసన చేపట్టారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ, ట్రాన్స్‌ఫర్ పితృత్వ సెలవులు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షురాలు పి.మమతా జ్యోతి, ఎ.సాయిశంకర్, కె.సాయితేజ, టి.రంగారావు, శ్రీరామ్, హిమజ, జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లంతా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు



డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా

అమలాపురం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా శనివారం తెలిపారు. ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈనెల19 నుంచి 26వరకు సీఎస్‌ఈ వెబ్ పోర్టల్‌లో ఆయా పాఠశాలల మేనేజ్‌మెంట్ విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో అర్హులైన చిన్నారులు చదువుకునే అవకాశం కల్పించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల28 నుంచి మే 15 వరకు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు సీఎస్‌ఈ ఏపీ జీవోవిఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిజండ్వాన్‌టేజ్ గ్రూపులైన అనాథలు, హెచ్ఐవీ ఎఫెక్టెడ్, దివ్యాంగులకు ఐదుశాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీలు, మైనార్టీలు, ఇతరులకు 6శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ.1.44లక్షల ఆదాయానికి మించి ఉండకూడదన్నారు. దరఖాస్తు చేసుకునే విషయంలో గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాయం చేస్తారన్నారు. అదేవిధంగా మండల విద్యాశాఖ కార్యాలయంలో దీనికి సంబంధించి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు సమగ్ర శిక్ష ఆల్టర్నేటివ్ స్కూలు కోఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, సెల్ 8555093096నుసంప్రదించాలన్నారు. ఈనెల19నుంచి మే15 వరకు విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందని, మే16నుంచి 20వరకు విద్యార్థుల అర్హత నిర్ధారణ జరిపి, మే 21 నుంచి 24 వరకు లాటరీ ద్వారా మొదటి విడత జాబితాలను విడుదల చేస్తామన్నారు. జూన్6న లాటరీ ద్వారా రెండో విడత జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరి సాకేత ఆలయంలోని శ్రీఅలివేలు మంగా పద్మావతి సమేతశ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీస్వామి-అమ్మవార్ల దివ్య కల్యాణం నిర్వహించారు. ఆలయ 8వవార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులుగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం కల్యాణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులుకల్యాణాన్ని తిలకించారు. ఎమ్మెల్యే బుచ్చిబాబు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

యానాం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని పరిపాలనాధికారి మునిస్వామి హెచ్చరించారు. ఇటీవల యానాం ప్రభుత్వాసుపత్రిలో వ్యక్తి మృతిపై బంధువులు ఆందోళన చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో యానాం ప్రభుత్వాసుపత్రిని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని సందర్శించి రోగులకు అందుతున్న సౌకర్యాలను అగిడితెలుసుకున్నారు. వ్యక్తి మృతిపై స్థానికంగా ఉన్న అధికారులతో త్రీమెన్ కమిటీని ఆరోగ్యశాఖ డీడీ వేశారన్నారు. అలాగే పుదుచ్చేరి ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు లేఖ రాశామని, పుదుచ్చేరి నుంచి కమిటీ వేయాలని సూచించినట్టు ఆయన తెలిపారు.

నూకాలమ్మకు విరాళం

మలికిపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గూడపల్లి నూకాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గూడపల్లి పల్లిపాలేనికి చెందిన వింజమూరి చినవెంకటేశ్వరరావు కుమార్తె కల్లూరి మహేశ్వరి-వీరవెంకటసత్యనారాయణ దంపతులు రూ.2.50లక్షలు విరాళం అందజేశారు. వారు హైదరాబాద్ కేబీహెచ్‌పీ కాలనీలో సత్యసూర్య విద్యా సంస్థలు నడుపుతున్నారు.

ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు సన్మానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖరంను శనివారం ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు ఆధ్వర్యంలో రాజశేఖర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, మండలనాయకులు నేరేడుమిల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, చొప్పల రాంబాబు, నల్లా రామకృష్ణ, నిమ్మన సత్యనారాయణ, వీవీవీ సత్యనారాయణ, బాలనాగు గుప్తా, కుంచే సిద్ధార్థప్రసాద్, చిక్కం మైనరుబాబు, ఆర్‌ఆర్కే ప్రసాద్, వంగా అయ్యప్పకుమార్, ఉండపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామగ్రామాన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

ఉప్పలగుప్తం, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు జరిగాయి. సర్పంచ్‌లు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు జరిగాయి. ఈవ్యర్థాల ర్యాలీలు నిర్వహించారు. ఈ-వ్యర్థాల ద్వారా సంపద సృష్టికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్‌లు కుంచే బుల్లియ్య, గెడ్డం స్వరూపాసురేష్‌బాబు, వాకపల్లి ఈశ్వరీసత్యనారాయణ, ఇసుకపట్ల జయమణీరఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం ఉద్యోగులు, సిబ్బంది స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆలయ ధార్మిక కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞలో పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, తడి, పొడి చెత్తలను వేరుచేయడంపై అవగాహన కల్పించారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవరరావు అన్నారు. మాచవరంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛాంధ్ర దివాస్ కార్యక్రమాన్ని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటరామన్నగూడెం బీఎస్సీ హార్టీకల్చర్ నాల్గవ సంవత్సరం విద్యార్థులు పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను స్థానిక కార్యాలయాలకు అందించాలని ప్రజలకు సూచించారు. లక్ష్మీలహరి, జ్యోతిక, మాధవి, సునీత, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగం కావాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్రా స్వచ్ఛ దివస్ కార్యక్రమం మగటపల్లి, నగరం గ్రామాల్లో శనివారం జరిగింది. మగటపల్లిలో నామన రాంబాబు, నగరంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు జాలెం రమణకుమారి పాల్గొన్నారు. విద్యార్థులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

మట్టి లారీ సీజ్

పి.గన్నవరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మానేపల్లి గ్రామ పరిధిలో కందాలపాలెం నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. గడువు ముగిసినా తవ్వకాలు నిలుపుదల చేయలేదన్నారు. లారీ యజమానికి జరిమానా విధిస్తామన్నారు.

హైకోర్టు జడ్జి రాజశేఖరరావు పూజలు

అంతర్వేది, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏపీ హైకోర్టు జడ్జి టి.రాజశేఖరరావు శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనంకల్పించి, వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఏసీ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.రాజశేఖరరావు దంపతులు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక అర్చనలు నిర్వహింపచేసి తీర్థ ప్రసాదాలతో పాటు వేదాశీర్వచనం చేశారు.

శ్రీకాంత్‌ను సత్కరించిన నేతలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్‌గా నియమితులైన పినిపే శ్రీకాంత్‌ను శనివారం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ పందిరి శ్రీహరిల ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, నాయకులు మర్యాద పూర్వకంగాకలుసుకుని సత్కరించారు.

కాలేయాన్ని సంరక్షించుకుందామని ర్యాలీ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆహార నియమాలను పాటిద్దాం అత్యంత కీలకమైన కాలేయాన్ని కాపాడుకుందామంటూ కిమ్స్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ గ్రూపు, వాకర్స్ హెల్త్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వరల్డ్ లివర్‌డేను పురస్కరించుకుని కాలేయ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చేపట్టిన ర్యాలీని కిమ్స్ వైద్య ప్రాంగణం నుంచి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్‌వర్మ ప్రారంభించారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఎన్.సుధీర్, డాక్టర్ కేపీఆర్ కిశోర్‌ల ఆధ్వర్యంలో తొలుత అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పీఎస్ శర్మ మాట్లాడుతూ ఆహారమే ఔషధం అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కాలేయ దినోత్సవానికి పిలుపునిచ్చినట్టు తెలిపి ప్రతిజ్ఞ చేయించారు. కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బోనం సత్యవరప్రసాద్, యర్రమిల్లి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పాలగుమ్మి విద్యార్థుల ప్రాజెక్టు ఎంపిక

అమలాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు పాలగుమ్మి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైనట్టు హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో రామచంద్రపురంలో జరిగిన ఈఎండీపీ ఎక్స్‌పోలో పాలగుమ్మి విద్యార్థుల ప్రాజెక్టు ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు వరుసగా మూడోసారి ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా ఏబీ చంద్రావతి వ్యవహరించారు. 9వ తరగతి విద్యార్థులు ఏఎస్‌ఎల్‌వీ నాగేశ్వరరావు, సీహెచ్ వెంకటరామతేజ సాధించిన విజయాన్ని ఉపాధ్యాయులతో పాటు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, ఎంపీటీసీ పాలగుమ్మి విజయ, చైర్మన్ కాత్రు మురళీకృష్ణమోహన్‌కుమార్ అభినందించారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

మలికిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధుల సహకారంతో చొరవ చూపాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్కవరం గొల్లపాలెం గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మంగెన భూదేవి, దిరిశాల బాలాజీ, కోట పుష్పకుమారి, బోనం సాయిరామ్, ఎం.నాగేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారికి శనివారం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ప్రత్యేకాలంకరణ చేశారు. నిత్యాభిషేకం, లక్ష్మీనారాయణ హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా చేశారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.2,75,319 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 5వేలు మంది దర్శించుకున్నారని, 2,200మంది నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

కార్యకర్తల సమస్యలు నా దృష్టికి తీసుకురండి: ఎంపీ



టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను అందిస్తున్న ఎంపీ హరీష్, రెడ్డి అనంతకుమారి

పి.గన్నవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు సమస్యలు వస్తే నేరుగా నా దృష్టికి తీసుకురావాలని, మీలో మీరు మదన పడొద్దని ఎంపీ హరీష్‌మాధుర్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమానికి నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. బీసీ, ఓసీ కార్పొరేషన్ల విషయంలో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నామని, పలు అంశాలను నాదృష్టికి తీసుకువచ్చారని ఈనెల24న కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో చర్చిస్తానన్నారు. టీడీపీ జిల్లాఅధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి మాట్లాడుతూ సభ్యత్వ కార్డు ప్రతి కార్యకర్తకు అందేవిధంగా క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఎంపీ హరీష్‌తో పాటు ముఖ్యనాయకులను, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులను ఘనంగా సన్మానిచారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నియోజకవర్గ కో-కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోళ్ల ప్రసాద్, మద్దాల సుబ్రహ్మణ్యం, నేదునూరి వీర్రాజు, చిట్టూరి శ్రీనివాస్, బొంతు పెదబాబు, చొల్లంగి సత్తిబాబు, సంసాని పెద్దిరాజు, శ్రీనురాజు, గణపతి వీరరాఘవులు, శేరు శ్రీనుబాబు, అరుమిల్లి లాల్‌బాబు, సాయిబాబు, గుడాల ఫణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

రాజోలు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బి.సావరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయంపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ అవగాహనా ర్యాలీ జరిపారు. ఎంటీ జోసెఫ్, జగడం సత్యనారాయణ, కుంపట్ల చిన్నారి, జిబీమరాజు, సీహెచ్ శ్రీనివాస్, పి.గణేశ్వరరావు, ఐసీఆర్పీఎస్ డి.శ్రీదేవి, కె.కనకదుర్గ పాల్గొన్నారు.

వైభవంగా పాళ్లమ్మ అమ్మవారి జాతర

మామిడికుదురు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఈదరాడ గ్రామదేవత పాళ్లమ్మ అమ్మవారి జాతరను శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారే వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సాధనాల సుబ్బారావు ఆధ్వర్యంలో జాతర ఘనంగా జరిగింది. జాతరలో తీన్మార్ డప్పులు, చిత్రవిచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, తెలంగాణ వాయిద్యాలు, డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి నిర్వహించిన పూజ గరగ ఊరేగింపు భక్తుల మనసులను రంజింప చేసింది. జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. అమ్మవారిని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే రాజోలు వరప్రసాద్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కూటమి నాయకులు దర్శించుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మురమళ్ల క్యాంపు కార్యాలయం వద అనారోగ్యంతో వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన 14మందికి శనివారం రూ.47.12లక్షల సీఎం సహాయనిధిని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, సాగిరాజు సూరిబాబురాజు, ధూళిపూడి వెంకటరమణ, కాకర్లపూడి రాజేష్, లంకపల్లి బుల్లియ్య, చిక్కాల శ్రీనివాస్, బొంతు శ్రీరాములు, సంగాని వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతవాసులకు నిరంతరాయంగా విద్యుత్

కాట్రేనికోన, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాల ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరాకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. పల్లంకుర్రులో శనివారం ఆయన ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయ్యాక మండలంలో తీరప్రాంత ప్రజలకు విద్యుత్ ఇక్కట్లు ఉండవన్నారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చెయ్యాలని ఆయన ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీను, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, దండుప్రోలు సత్యం, వెంట్రు సుధీర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో స్వచ్ఛభారత్

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి సురక్షిత పద్ధతుల్లో రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్ పద్ధతిన చేపట్టడానికి ప్రభుత్వ ప్రత్యేక దృష్టి పెట్టిందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. అనంతరం కమిషనర్ పి.రవివర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని పట్టణంలో దుకాణదారుల నుంచి వేస్టేజ్‌ను పారిశుధ్య కార్మికులతో కలిసి సేకరించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, దాట్ల పృథ్విరాజ్, గుద్దటి జమ్మి, సాగి సూరిబాబురాజు, చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన దొమ్మేటి శేషసత్యగిరిజావాణి కుటుంబ సమేతంగా శనివారం శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళంఅందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

మలేరియాపై అవగాహన ఉండాలి

మలికిపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ మలేరియాపై అవగాహన ఉండేలా వైద్య సిబ్బంది చైతన్య పరచాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం లక్కవరం, కేశనపల్లి పీహెచ్‌సీలను సందర్శించారు. పీహెచ్‌సీల్లో పరీక్షలు, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మలేరియా అధికారి వెంకటేశ్వరరావుతో పాటు డాక్టర్ పానవి, డాక్టర్ సాయిబాబా, సూపర్‌వైజర్ నరసింహారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవహక్కుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

పి.గన్నవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సాయితేజ పబ్లిక్‌స్కూల్లో జిల్లా స్థాయి మానవహక్కుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారంఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు కె.బాలాజీ తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా కొండ్రెడ్డి బాలాజీ, ఉపాధ్యక్షుడిగా జల్లి జాషువా, ప్రధాన కార్యదర్శిగా బీఎస్‌డీ లావణ్య, మహిళా కార్యదర్శులుగా గెడ్డ సుదర్శిని, కడలి మాధవి, లక్ష్మీతులసీరమాదేవి, శారాధాకృష్ణ, ఆరుగురు కార్యదర్శులు, ఒక ట్రెజరర్, ఇద్దరు అడ్వజరీ మెంబర్లను ఎన్నుకున్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాము పరిశీలన

ముమ్మిడివరం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ యంత్రాల గోదాము పటిష్టత, భద్రతకు పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్‌ఎన్ రాజకుమారి సూచించారు. నెలవారీ సాధారణ తనిఖీలో భాగంగా ఎయిమ్స్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము పటిష్టత చర్యలను శనివారం ఆమె పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా తనిఖీచేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో నిఘా ఉంచాలన్నారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో ఆమె సంతకం చేశారు. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ శివరాజ్‌గణపతి, కలెక్టరేట్ ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హైకోర్టు జడ్జి పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయాల్లో శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.రాజశేఖరరావు కుటుంబ సభ్యులతో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో అర్చక బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంత రం స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆలయ చరిత్రలను తెలుసుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవోలు నల్లం సూర్యచక్రధరరావు, రమణమూర్తి వారికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందచేశారు.



వాడపల్లిలో వేదపండితుల ఆశీర్వచనం పొందుతున్న హైకోర్టు జడ్జి రాజశేఖరరావు

కేశవస్వామి ఆలయంలో సివిల్ కోర్టు జడ్జి పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అశేష భక్తజనం స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎంవీఎస్ సుబ్బారావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ ఈవో రమణమూర్తి ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కొవ్వూరు సివిల్ కోర్టు జడ్జికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు ఐపీ శెట్టి

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

రాయవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అధికారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతల కోసం చేపడుతున్న కార్యక్రమాలను ఐసీడీఎస్ పీవో గజలక్ష్మి వివరించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు ఐపీ శెట్టి సూచించారు. సూర్యఘర్ యోజన ద్వారా అందిస్తున్న రాయితీలను ఏఈ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా గ్రామాలను శుభ్రంగా ఉండాలని పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తమ గ్రామాల్లోని సమస్యలను ప్రజా ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకపోగా సమావేశం మొక్కుబడిగా సాగింది. ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా సమావేశానికి హాజరైన చింతపల్లి రామకృష్ణను, ఈవోపీఆర్డీ పేరును ప్రభుత్వం డిప్యూటీ ఎంపీడీవోగా మార్చడంతో ఈవోపీఆర్డీగా ఉన్న ఎస్.శ్రీనివాసరావును అధికారులు, ప్రజా ప్రతినిధులు సత్కరించారు. సమావేశంలో జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, ఎర్ర పోతవరం నీటి వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షుడు కొరిపిల్ల శ్రీనివాసరావు, ఎంఈవో వై.సూర్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డికి పలువురు నివాళి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యు విద్యార్థి సంఘం నిర్మాత, కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక పిల్లా వారిపాఠశాలలో నిర్వహించిన వర్ధంతి సభలో జార్జిరెడ్డి చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు, పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ తదితరులు పాల్గొన్నారు.



జార్జిరెడ్డికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి అన్నారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు, కపిలేశ్వరపురం మండలంలోని మాచర, నిడసనమెట్ట గ్రామాల్లో ప్రాజెక్టు అధికారిణి ఎ.గజలక్ష్మి ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో వారు మాట్లాడారు. పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా ఈనెల 8 నుంచి 22 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో దీన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తల్లులు, గర్భవతులు, బాలింతలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.



మాచర సభలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

ధాన్యం కొనుగోలులో నిబంధనలు పాటించాలి

రాయవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని నిబంధనలకు అనుగుణంగా తీసుకుంటున్నారా అనే విషయాన్ని శనివారం తహశీల్దారు ఐపీ శెట్టి, మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ పరిశీలించారు. మండలంలోని సోమేశ్వరం శ్రీలక్ష్మి గణపతి రైస్‌మిల్లుల్లో ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. తహశీల్దారు ఐపీ శెట్టి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు జరగాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సీఎంఆర్ ద్వారా రైస్‌మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని అధికారులు పరిశీలించారు. పొల్లు శాతం ఏవిధంగా ఉందనే అంశాన్ని తహశీల్దారు, ఏవో పరిశీలించారు.



సోమేశ్వరంలో రైస్‌మిల్లులో ధాన్యం కొనుగోలు తీరును పరిశీలిస్తున్న అధికారులు

అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండపేట ఫైర్ ఆఫీసర్ హనుమంత రావు అన్నారు. శనివారం కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వద్ద ఆసుపత్రి సిబ్బందికి, పేషెంట్లకు, ప్రజలకు అగ్ని ప్రమాదాలపై నిర్వహించిన అవగాహనలో ఆయన మాట్లాడారు. అగ్నిమాపక కేంద్ర అధికారి హనుమంతరావు అగ్ని ప్రమాదాలపై అవగాహన, డెమో నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, గ్రామప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ హనుమంతరావు

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నేడు మెగా రక్తదాన శిబిరం

మండపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజును పురస్కరించుకుని మండపేట వున్న సూర్య కన్వెన్షన్ హాలులో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు.



జేఈఈ మెయిన్స్‌లో ఆలమూరు విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. చెముడులంక గ్రామానికి చెందిన అడపా వీరవినోద్ ఓపెన్ కేటగిరిలో 3,142 ర్యాంకు, సంధిపూడి గ్రామానికి చెందిన తోట వెంకటరాజు 3,557 ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు పలువురు అభినందించారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్ చేయడమే లక్ష్యం

అవగాహన సదస్సులో కలెక్టర్ మహేష్‌కుమార్, రవిసుభాష్



ఆలమూరులోని చెత్త సేకరణ కేంద్రంలో సిబ్బందితో కలెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారులు

ఆలమూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్తను క్రమపద్ధతిలో సేకరించి రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డాక్టర్ ఎన్టీఆర్ సేవా ట్రస్టు సీఈవో, జిల్లా ప్రత్యేకాధికారి రవిసుభాష్ పాటంశెట్టి, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. ఆలమూరు చెత్త సేకరణ కేంద్రాన్ని శనివారం వారు సందర్శించి సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. తడిపొడి చెత్తలతోపాటు ఎలక్ట్రానిక్స్ వస్తువుల సేకరణపై ముందుగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తద్వారా సిబ్బంది ఆమేరకు సేకరణ చేయాలని వారు సూచించారు. చెత్త నుంచి వచ్చే ప్రతి వస్తువును ఉపకరించేలా చెత్త సేకరణ కేంద్రం లో ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచితే ఇది విజయవంతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక కేంద్రాన్ని పరిశీలించి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య వివరాలను స్థానిక ఎంపీడీవో ఎ.రాజు, కార్యదర్శి మోక్షాంజలిలను వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డీఎల్‌డీవో ఎస్‌టీవీ రాజేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి ఐసీడీఎస్ పీడీ డి.శాంతలక్ష్మి, ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ ప్రకాష్‌బాబు, సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, కార్యదర్శి మోక్షాంజలి తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

మండపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం విషయంలో మండపేటను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు, వార్డుల్లో సాగింది. గ్రామాల్లో కంపోస్టుయార్డుతో పాటు స్థలం సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కమీషనర్ టీవీ రంగారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, మున్సిపల్ డీఈఈ కె.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, శానిటరీ, సచివాలయ, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పించేందుకు ఆలమూరులో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల మద్దతు అవసరమని ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివాస్ ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, హౌసింగ్ ఏఈ డి.శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర 2047 సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ రామస్వరూప్, సర్పంచ్ గెడ్డం సుధ పాల్గొని ప్రతిజ్ఞ నిర్వహించారు. వ్యర్థాల సేకరణ, చెత్తా చెదారం తొలగించడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివాస్ నిర్వహించి పరిసరాలు శుభ్రం చేసి ర్యాలీ జరిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రదర్శన

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శన, మానవహారం జరిపారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పలు నినాదాలు చేస్తూ ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాకేష్‌కుమార్, బీజేపీ నాయకులు దొంతంశెట్టి ఓంప్రకాష్, వీఆర్‌వో ఎన్.సత్తిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం కె.గంగవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ జరిపారు. ప్రజలను చైతన్యవంతులను చేసేలా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద మానవహారం జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, ఎంఈవో ఏ.నాగరాజు, ఎంఈవో2 సి.ఆంజనే యులు, కార్యదర్శి సాయిరామ్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వీవీ బ్రహ్మానందం, ఉపాధ్యాయులు ఏడు కొండలు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వానపల్లిలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా మార్చడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో పర్యావరణం కలుషితం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ వ్యర్థాల కారణంగా ప్రజలకు ఆరోగ్య సమస్యలు రావడంతో పాటు గాలి, నీరు, నేల కూడా కలుషితమవుతున్నాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.అరుణకుమార్, కె.రజని, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర నిర్వహించారు.



కొత్తపేట మండలం వానపల్లిలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు



సంధిపూడి మండల పరిషత్ స్కూల్‌లో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ దుస్తులు

మండల పరిషత్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

ఆలమూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సంధిపూడి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగులకొండ శ్రీనివాస్ అధ్యర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే జరిపారు. విద్యార్థులకు తరగతి వారీగా ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోలేటి సంతోషి, పాఠశాల ఉపాధ్యాయులు బి.లోకేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు నెం 1 పాఠశాల వార్షికోత్సవం

కె.గంగవరం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామర్రు గ్రామంలోని నెం1 పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయుడు అవసరాల వెంకట్రావు, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా ప్రణాళిక తదితర పలు అంశాలపై వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంఈవో ఏ.నాగరాజు, పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణ అవుతున్నా పట్టించుకోరా?

మండపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) మండపేట మున్సిపాల్టీకి చెందిన వాటర్ వర్క్సు స్థలం ఆక్రమణలకు గురైందని తక్షణమే ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధికారులను నిలదీశారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ పతివాడ నూకరాణి అధ్యక్షతన జరిగిన అత్యవసర, సాధారణ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరయ్యారు. అజెండాలోని పలు అంశాలను సమావేశంలో అమోదించారు. మున్సిపల్ అత్యవసర సమావేశంలో మున్సిపల్ ప్యానెల్ కమిటీలు పారిశుధ్య కమిటీల ఏర్పాటుపై చర్చించారు. పారిశుధ్య కమిటీలో వైస్ చైర్మన్‌లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య బాబు, కౌన్సిలర్‌లు, చుండ్రు సుబ్బారావు చౌదరి, మందపల్లి రవి, కొవ్వాడ బేబీలను ఎన్నుకున్నారు. ప్యానల్ కమిటీలను వచ్చే కౌన్సిల్ సమావేశంలో సభ్యుల సూచనల మేరకు ఎన్నుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ కరాచి సెంటర్‌లో వున్న జాతీయ నాయకుల సెంటర్‌లో చంద్రబాబు పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్ కనిపించకుండా ఏర్పాటు చేసిన దిమ్మల విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన కౌన్సిల్‌ను కోరారు. ఇదే అంశంపై వైసీపీ కౌన్సిలర్ జాతీయ నాయకులు సెంటర్ వద్ద నేతల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ అక్కడ చంద్రబాబు పైలాన్ కనిపించకుండా అవమానించేలా ఉన్న దిమ్మను తొలగించాలని కోరితే కులాల మధ్య చిచ్చు పెట్టేలా కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట జోక్యం చేసుకుని అక్కడ ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై కౌన్సిల్ రగడ: మున్సిపల్ కార్యాలయం వెనక భాగంలో మున్సిపల్ కార్యాలయానికి చెందిన ఉద్యోగుల రిక్రియేషన్ భవనంతోపాటు శానిటేషన్ కార్యాలయం ఉందని అక్కడ ఏర్పాటు చేసిన మద్యం దుకాణం తొలగించాలని ఎమ్మెల్సీ తోట డిమాండ్ చేశారు. అక్కడ వున్న కార్యాలయం ముందు అక్రమంగా ఏర్పాటు చేసి బడ్డిలను తొలగించటంతోపాటు, మద్యం దుకాణం తొలగించాలని కోరారు.

సోలార్ సిస్టంపై ప్రచారం చేయాలి: సోలార్ సిస్టంపై ప్రభుత్వ సబ్సిడీ, దానివల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే వేగుళ్ల అధికారులను కోరారు. దానిపై విస్తృత ప్రచారం జరగాలని ఆయన అధికారులకు సూచించారు. మండపేట మున్సిపల్ కార్యా లయం, వాటర్ వర్క్సుపై సోలార్ సిస్టంను ఏర్పాటు చేయాలన్నారు.

బ్లాక్‌లిస్టులో చేర్చాలి: మున్సిపల్ పనులు చేసేందుకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసి పనులు చేసేందుకు ముందుకురాని కాంట్రాక్టర్‌లను బ్లాక్‌లిస్టులో చేర్చాలని ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోట కోరారు. వారి జాబితాను మున్సిపల్ ఉన్నతాధికారులకు పంపించి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమావేశంలో సభ్యుల మధ్య వాడివేడిగా మాటల యుద్ధం జరిగింది. సమావేశంలో కమీషనర్ టీవీ రంగారావు, వైస్ చైర్మన్‌లు, పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నాయయ్య బాబు, కౌన్సిలర్‌లు, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోట



శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లి ఒక్కరోజు ఆదాయం రూ.2.08 లక్షలు

కొత్తపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,08,497 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మంగళగిరి సీఐడీ ఎస్పీ కె.ఈశ్వర్ కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.



అన్నదానం చేస్తున్న సత్యం

దివ్యాంగులకు అన్నదానం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి వాసంశెట్టి సుభాష్ వివాహ వార్షికోత్సవాన్ని దివ్యాంగుల ఆశ్రమంలో పలువురు కూటమి నాయకులు నిర్వహించారు. శనివారం రాత్రి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు ముచ్చుమిల్లి రోడ్డులో ఉన్న న్యూ లైఫ్ సెంటర్ దివ్యాంగుల ఆశ్రమానికి చేరుకున్నారు. మానసిక దివ్యాంగులు, అనాధలకు అన్నదానం చేశారు. దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు ఎటువంటి అవసరాలున్నా నెరవేరుస్తానని వాసంశెట్టి సత్యం వారికి హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ద్రాక్షారామ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్లలో శనివారం విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మాక్ డ్రిల్లు నిర్వహించి ప్రజలకు, పీహెచ్‌సీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫైర్ అధికారి నాగేశ్వరరావు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు అలేఖ్య, ప్రసన్న పలు సూచనలు, సలహాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ సూపర్‌వైజర్ కమల్ శేషు, ఫైర్‌మాన్ కె.శ్రీనివాస్, చీకట్ల వీరబాబు, మహేష్, ఏవీవీ మూర్తి పాల్గొన్నారు.

శాంతిమార్గంలో నడుచుకోవాలి

రన్ ఫర్ జీసస్‌లో ఎమ్మెల్యే

మండపేట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): యేసు చూపిన శాంతి మార్గంలో నడుచుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. మండపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్, రక్షణ టీవీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ బిషప్, డాక్టర్ డేనియోల్‌పాల్ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక బేతస్థ మందిర నిర్వాహకులు పాస్టర్ ఉదయ భాస్కర్ చర్చి వద్ద నుంచి ప్రారంభమైన జీసస్ రన్ ర్యాలీలో ఎమ్మెల్యే వేగుళ్ల పాల్గొని తన సందేశాన్ని అందించారు. ఇటీవల మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేశారు. రన్ ఫర్ జీసస్ కార్యక్రమం మండపేట నుంచి తాపేశ్వరం వరకు సాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, బిషప్ ఉదయభాస్కర్, పాస్టర్‌లు డి.భూషణం, సాల్మన్‌రాజుతోపాటు దూళి జయరాజు, పలువురు క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ పునరుత్థాన విజయోత్సవం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం పునరుత్థాన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈస్టర్ సందర్భంగా రూబెన్ చర్చి నుంచి కపిలేశ్వరపురం మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ కమ్యూనిటీ హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. అంగర గాంధీ సెంటర్ అధ్యక్షులు రూబెన్ ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ రూబెన్, ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజు, కార్యదర్శి కిరణ్‌పాల్, కోశాధికారి ఇమ్మానుయేల్, చీఫ్ పెట్రోన్ నానిబాబు, ప్రసాద్ తదితరులతోపాటు పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.



అంగరలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రూబెన్